

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం

19 సెప్టెంబర్ 2025 పేజీలు : 08


# అంగన్వాడీలపై కేసులు ఎత్తివేయాలి

## అంగన్‌వాడీలంటే 'అమ్మ'లాంటి సేవలు అందించేవారు

- సూపర్ సిక్స్ ద్వారా ప్రజలకు నిజమైన సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తోంది..
- అద్దె భవనాలలో నిర్వహిస్తున్న అంగన్వాడీ సెంటర్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి
- గిరిజన ప్రాంతాలలో స్త్రీలు, పిల్లలకు సేవలందించే అంగన్వాడి సెంటర్లలో మౌలిక సదుపాయాలూ కల్పించండి
- శాసనసభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :

ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేస్తున్నారన్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం శాసనసభ తొలిరోజు సమావేశాల సందర్భంగా ఆమె అంగన్వాడీ వర్కర్ల సమస్యలపై గళమిప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. అంగన్వాడీలు అంటే 'అమ్మ' లాంటి సేవలు అందించేవారని, పిల్లల ప్రథమ గురువుగా బాధ్యతలు నెరవేరుస్తున్న వారి పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ టీచర్లు మీద పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయవలసిందిగా ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ఫేస్ యాప్, ఇన్, అవుట్ లొకేషన్ విధానాలలో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా అంగన్వాడీలు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆమె సభ దృష్టికి తెచ్చారు. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం కోసం 4200 రూపాయల జీతాన్ని ఒక్కసారిగా 10,500 రూపాయలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన జీవో నెం.116కు సంబంధించి రాష్ట్రంలో ఉన్న మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా

-మిగతా 2లో






## వైద్యం.. ప్రైవేట్‌పరం దారుణం

### కాకాణి పూజిత వెల్లడి



జగన్మోహన్ రెడ్డి హయాంలో మంజూరైన 10 మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులు వేయడం దారుణమని వైసీపీ రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత వెల్లడించారు.

వివరాలు 2లో

## నెత్తురోడుతున్న జాతీయ రహదారి

వివరాలు 4లో

## వాహన మిత్ర పథకం కోసం దరఖాస్తు చేసుకోండి

### కలెక్టర్ హిమాన్సు శుక్లా



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

ఆటో, మాక్సీ క్యాబ్ వాహన యజమానులు 'వాహన మిత్ర' పథకం కోసం సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్ల తెలిపారు. ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తులను అందించాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ కార్డ్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ మొదల్కైన సర్టిఫికెట్లతో దరఖాస్తులు అందించాలన్నారు. బ్యాంక్ అకౌంట్‌కి ఆధార్, ఎన్‌పిసిఐ లింక్ చేసుకోవాలన్నారు. గతంలో (2023 వరకు) ఈ పథకం కోసం దరఖాస్తు చేసిన వారు మరలా దరఖాస్తు చేయావల్సిన అవసరం లేదని, ఇప్పటి వరకు దరఖాస్తు చేయనివారు మాత్రమే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆటో, మాక్సీక్యాబ్ వాహన యజమానుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## డ్రగ్స్ కేసులో.. నిడిగుంట అరుణ

### నేడు బెయిల్ పిటిషన్‌పై విచారణ



నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :

గంజాయి తదితర మాదకద్రవ్యాలను సరఫరా చేస్తూ పోలీసులకు దొరికి పోయారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో జైలులో ఉన్న అరుణ తనను బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ నెల్లూరు ఒకటవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్ పై శుక్రవారం విచారణ జరగనుంది. హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న రౌడీ షీటర్ శ్రీకాంత్‌కు సన్నిహితంగా వ్యవహరించి అతని పెరోల్‌పై విడుదల చేసేందుకు శక్తి యుక్తులు ప్రదర్శించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటూ రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన నిడిగుంట అరుణ కొంతకాలం క్రితం పోలీసులకు చిక్కి రిమాండ్ ఖైదీగా జైలు జీవితం గడుపుతున్నారు. తనపై అక్రమంగా పోలీసులు కేసు పెట్టారంటూ అరుణ బెయిల్‌పై విడుదల చేయాలని న్యాయస్థానాన్ని గతవారం ఆశ్రయించారు. శుక్రవారం ఈ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరగనుంది. కాగా అరుణను పోలీసులు కస్టడీ పిటీషన్ ద్వారా కోర్టు అనుమతి తో విచారించి అనేక వివరాలను రాబట్టారు. అరుణపై మాదక ద్రవ్యాల అక్రమ సరఫరా కేసుతో పాటు రియల్టర్‌ను బెదిరించారనే ఆరోపణలతోపాటు నగరంలో రౌడీ శక్తులను కూడా పెంచి పోషిస్తున్నట్లు అరుణ పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.


# వైద్యం.. ప్రైవేట్‌పరం దారుణం : కాకాణి పూజిత వెల్లడి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జగన్మోహన్ రెడ్డి హయాంలో మంజూరైన 10 మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులు వేయడం దారుణమని వైసీపీ రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత వెల్లడించారు. గురువారం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేయించి, 7 మెడికల్ కాలేజీలను పూర్తి చేసి, 10 మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తయ్యే దశలో చంద్రబాబు అధికారం చేపట్టారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి తెచ్చిన మెడికల్ కాలేజీలను స్వార్థ ప్రయోజనాల కోసం చంద్రబాబు ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఎన్నో దఫాలు పని చేసినా, రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీ తీసుకొని వచ్చిన సందర్భం లేదని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్యను అందించేందుకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మంజూరు చేయించారని వివరించారు. జగన్మోహన్ రెడ్డి కృషి వలన, రాష్ట్రంలో వైద్య విద్య అభ్యసించాలనుకునే వారికి మరో 2,500 సీట్లు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. పేద విద్యార్థుల వైద్య విద్యను అభ్యసించాలనే కలను చంద్రబాబు దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని సూచించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించడంతోపాటు, పేదలకు వైద్యాన్ని అందించే సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రులు అనుసంధానంగా నెలకొంటాయని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా, మెడికల్ కాలేజీల కోసం స్థల సేకరణ, అనుమతులతో పాటు, 7 మెడికల్ కాలేజీలను పూర్తి స్థాయిలో నిర్మిస్తే, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు మిగిలిన మెడికల్ కాలేజీలను పూర్తి చేయడానికి నిధులు లేవనడం హాస్యాస్పదమన్నారు. కూటమి ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులు చేసినా, సంక్షేమ పథకాలు అరకొరగా అమలు చేస్తూ, రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి కంటికి కనపడటం లేదని చెప్పారు. చంద్రబాబు అమలు చేసిన సూపర్ సిక్స్ సూపర్, డూపర్ ఫ్లాప్ అయ్యిందని తెలిపారు. చంద్రబాబు తన పబ్లిసిటీల కోసం ఉండే నిధులు పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించే మెడికల్ కాలేజీలను పూర్తి చేయడానికి ఎందుకు లేవో సమాధానం చెప్పాలని కోరారు. చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి, స్వార్థంగా జగన్మోహన్ రెడ్డికి మంచి పేరు రాకూడదనే ఉద్దేశ్యంతో పని చేస్తున్నాడని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలలో ప్రభుత్వ ఆస్తులను పిపిపి విధానం ద్వారా ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తే ప్రజా వ్యతిరేకత తట్టుకోలేక ఉపసంహరించుకున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్న మొదటి ప్రభుత్వం చంద్రబాబు ప్రభుత్వం అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నా, చంద్రబాబు మాత్రం చెవిటోడి ముందు శంఖం ఊదినట్లు ప్రవర్తిస్తున్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన, పేదల వైద్యానికి అవసరమైన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే పూర్తి చేయాలన్నారు. జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా ఈనెల 19వ తేదీన, చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని వైయస్సార్ కాంగ్రెస్ చేపట్టిందన్నారు.

# బాధిత కుటుంబాలను అండగా కూటమి ప్రభుత్వం

- పెరమన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీ, శ్రీనివాసులు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం
- బాధిత కుటుంబాల తరపున సీఎంకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** సంగం మండలం పెరమన వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 7 మంది మృతి చెందిన సంఘటన జిల్లాలో విషాదం నింపిన విషయం తెలిసిందే. మృతుల్లో కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేట అరుంధతివాడకు చెందిన చల్లగుండ్ల లక్ష్మీ, శ్రీనివాసులు దంపతులు ఉన్నారు. తక్షణమే స్పందించిన ప్రశాంతమ్మ.. ఈ విషయాన్ని సీఎం, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. మానవతా దృక్పథంతో స్పందించిన సీఎం చంద్రబాబు.. బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 5 లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు కూడా స్వయంగా ఫోన్ చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని సూచించారు. ఇందుకూరుపేట చల్లగుండ్ల లక్ష్మీ శ్రీనివాసులు కుటుంబానికి ఐదు లక్షల పరిహారం ప్రకటించిన సీఎం చంద్రబాబుకు బాధిత కుటుంబం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.



## బాధితులకు అండగా నిలబడిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు :

సంగం మండలం పెరమన వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా నిలబడిన సీఎం చంద్రబాబు నాయుడుకు, ప్రభుత్వానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఒక్కో కుటుంబానికి 5 లక్షల నష్టపరిహారం ప్రకటించి ఆదుకుంటుందని చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని పేర్కొన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తక్షణ సహాయం అందజేస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అంగన్వాడీలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అప్‌గ్రేడ్ చేయడంతోపాటు కొత్తగా 4687 హెల్పర్ల నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లాలో యానాది తెగకు చెందిన గిరిజనులు ఎక్కువగా నివసించేది కోవూరు నియోజకవర్గంలోనేనని, 138 గిరిజన కాలనీలలో దాదాపు 35 వేల మంది గిరిజనులు నివసిస్తున్నారన్నారు. గిరిజన గర్భిణీ స్త్రీలు, పిల్లలు ఎక్కువగా అంగన్వాడీ కేంద్రాల మీద ఆధారపడి ఉంటారని, కోవూరు నియోజకవర్గ పరిధిలో 407 అంగన్వాడి సెంటర్లు ఉంటే, వాటిలో 212 అంగన్వాడీ కేంద్రాలు సొంత భవనాలలో కొనసాగుతున్నట్లు చెప్పారు. 115 అంగన్వాడి సెంటర్లు అద్దె భవనాలలో ఉన్నాయని, మరో 80 అంగన్వాడి సెంటర్లు కొన్ని ప్రభుత్వ భవనాలలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారన్నారు. అద్దె భవనాలలో నిర్వహిస్తున్న అంగన్వాడీ సెంటర్లకు సొంత భవనాలు ఏర్పాటు చేసి ఉన్న భవనాలలో మౌలిక సదుపాయాలు కల్పించవలసిందిగా మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రికి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఫైనాన్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ఎంపీ, మెంబర్ ఆఫ్ ఫైనాన్స్ కమిటీ వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డి గురువారం ఢిల్లీలోని సంవిధాన్ సదన్‌లో జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి ముందు ఫైనా న్స్ కమిటీ సభ్యులకు ప్రత్యేక ఫొటో సెషన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఫొటో సెషన్‌లో మిగతా కమిటీ సభ్యులతో ఆయన ఫొటోలు దిగారు. అనంత రం కమిటీ సమావేశంలో పాల్గొని వివిధ ఆర్థిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

## దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటాం

ఈది లక్ష్మీనరసమ్మ, వెంకటరామయ్య



**అనంత సాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలంలోని బొమ్మవరం పంచాయతీలోని చాపరాలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఈది లక్ష్మీనరసమ్మ, అతని కుమారుడు వెంకటరామయ్యపై సమీప బంధువు ఇటీవల దాడి చేసి కొట్టారని ఈ విషయంపై సాగరం పోలీసులకు ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకోలేదని గురువారం తమఇంటి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. బాధితులు మాట్లాడుతూ.. గతనెల 23వ తేదీన తమ ఇంటి ముందు సిమెంటుతో ఫ్లోరింగ్ చేస్తుండగా తమ ఇంటి వెనక ఈది రత్నయ్య, సాయిశ్రీ, రాజేశ్వరి, వెంకటరమణయ్య పనులు చేయవద్దని దాడి చేసి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని సాగరం పోలీసులకు ఫిర్యాదు చేస్తే న్యాయం జరగలేదన్నారు. తెలియకుండానే ఇరువర్గాలు పిలిచి న్యాయం చేసినట్లు ఆన్లైన్ కాపీ ఇచ్చారన్నారు. తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటామని ఆందోళన వ్యక్తం చేశారు.

# ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లోని ఆయుధాలు గది.. ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించిన ఎస్పీ



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** జిల్లా ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లోని ఆయుధాలు గది, స్టోర్ రూమ్, అడిషనల్ ఎస్పీ ఏఆర్, డీఎస్పీ ఏఆర్, ఆర్ఐ అడ్మిన్, ఆర్ఐ వెల్ఫేర్ గదులు, ఇంటిగ్రేటెడ్ పోలీస్ కంట్రోల్ రూమ్‌ను గురువారం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సందర్శించారు. ఈ సందర్భంగా బెల్ ఆఫ్ ఆమ్స్‌లో గల ఆయుధాలు ఎన్ని ఉన్నాయి? ఏవేవి ఉన్నాయి? మందు గుండు సామాగ్రి, స్టోర్ రూమ్‌లో గల అత్యవసర సామాగ్రి తదితర వస్తువులను పరిశీలించారు. అదేవిధంగా ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని, బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించాలని, అప్రమత్తంగా ఉండాలని అక్కడ అధికారులకు సూచించారు. అనంతరం పోలీస్ కంట్రోల్ రూమ్ను సందర్శించి సీసీ కెమెరాలు, ఎల్‌హెచ్‌ఎంఎస్, వీడియో వాల్, డయల్-112 కంట్రోల్ రూమ్ వ్యవస్థ పనితీరును పరిశీలించి సిసి కెమెరాలు, ఏమి పని చేస్తున్నాయి.. ఎక్కడెక్కడ పనిచేయట్లేదు.. ఎందుకు? పనిచేయని వాటిని వెంటనే మరమ్మతులు చేయాలని వెంటనే మనమత్తులు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. డయల్-112, శక్తి యాప్ కాల్స్ వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, ఇటువంటి జాప్యం జరగరాదని, అదనపు సౌకర్యాలు ఇంకా ఏమైనా కావాలని వారిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహించండని సిబ్బందికి హెచ్చరికలు చేశారు. ఈ మధ్యకాలంలో సీసీటీవీ ఫుటేజి ద్వారా చేదించిన కేసులను తెలుసుకొని, నేర నిరోధం, ట్రాఫిక్ నియంత్రణలో బాగా పని చేయాలని, సమర్థతను మరింత పెంచుకోవాలని సూచించారు. సమయపాలన పాటించాలని.. విధులలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. చివరిగా కంట్రోల్ రూమ్ వ్యవస్థ పని తీరు బాగుందని, పరిసరా శుభ్రంగా ఉన్నాయని ఎస్పీ అభినందించారు. సందర్శ నలో అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, ఏఆర్ డీఎస్పి చంద్రమోహన్, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, ఆర్ఐ ఎన్‌టి శ్రీహరిబాబు, పిసిఆర్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

# సమాజంలో సమిష్టిగా స్వచ్ఛత పాటించాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో అన్నివర్గాలవారు సమిష్టిగా స్వచ్ఛత పాటించాలని ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పిలుపుమేరకు అన్ని మున్సిపాలిటీల్లో స్వచ్ఛఉత్సవ్2025 కార్యక్రమాన్ని ఆత్మకూరులో ఇన్‌చార్జ్ కమీషనర్ డి.మాధవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రారెడ్డి ప్రసంగిస్తూ అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛతహీసేవ కార్యక్రమం అమలుచేస్తుందన్నారు. అన్నివర్గాల వారు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయన కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. అందరి ఆరోగ్యపరిరక్షణ కోసం ప్రభుత్వం ఈకార్యక్రమం రూపొందించిందన్నారు. తమ ఇళ్ళలోని చెత్తాచెదారాలను ఎక్కడబడితే అక్కడ వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, కౌన్సిలర్లు సూరా




భాస్కరరెడ్డి, పొడమేకల పెంచలయ్యయాదవ్, దగ్గుమాటి శివకోటారెడ్డి, షేక్ మహబూబ్‌బాషా, శానిటరి ఇన్స్‌పెక్టర్ జి.శిరీష్‌కుమార్, ఆర్‌ఐ షేక్ షాజహాన్, మేనేజర్ నూరుల్లాహుస్సేనీ, మెప్మా సివో జి.మాధవి, తెలుగు దేశం నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, కొప్పోలు చిన్నపురెడ్డి, కార్యాలయ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తుల

# మృతదేహాలతో సీపీఎం రాస్తారోకో



- బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సీఎంపీ ఆందోళన
- ఒక్కో బాధితులకు 5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషాయా ఇవ్వాలని డిమాండ్
- అధికారుల హామీతో ఆందోళన విరమించిన సీపీఎం నాయకులు

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా సంఘం మండలం పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దుర్ఘటనలో ఏడుగురు మృతి చెందిన ఘటనపై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు సిటీ ముత్తుకూరు గేటు సెంటర్లో మృతదేహాలతో రాస్తారోకో మరియు నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఏడు మందిలో ఒకరు కలవాయి, ఇద్దరు ఇందుకూరుపేట, ఇద్దరు ధనలక్ష్మీపురం సెంటర్ పక్కన ఉన్న బాబా నగర్, మరో ఇద్దరు నెల్లూరు సిటీ గుర్రాలు మడుగు సంఘం నివాసులుగా ఉన్నారు. వీరిలో గుర్రాలు మడుగు సంఘం నివాసులైన శేషం చిన్నబాల వెంగయ్య (35), శేషం శారమ్మ (40) మృతదేహాలను సిపిఎం నాయకులు గుర్రాలు బడుగు సంఘం నుండి ఊరేగింపుగా తీసుకువెళ్లి ముత్తుకూరు గేటు సెంటర్లో రోడ్డుపై మృతదేహాలను పెట్టి బైటాయించి ధర్నా చేశారు. బాధితులకు తక్షణమే ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు నెల్లూరు నగరంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్లు రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు పోలీసు బలగాలు మోహరించి ఆందోళన విరమించమని సీపీఎం నాయకులను కోరారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు అధికారులు వచ్చి హామీ ఇచ్చేంత వరకు విరమించే ప్రసక్తే లేదని వారు తేల్చి చెప్పడంతో జిల్లా అధికార యంత్రాంగం తో పోలీసులు చర్చ జరిపారు. ఈ సందర్భంగా సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఖాయంబు శ్రీనివాసులు మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలో సంచలనం సృష్టించి ప్రజలందరూ తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ఘటన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబంలో ఆరుగురు మరియు డ్రైవరు చనిపోవడం ప్రజలందరినీ తీవ్ర విషాదంలో నింపిందని అన్నారు. బాధితులకు న్యాయం చేయాలని సీపీఎంగా ఆత్మకూరులో ఆందోళన చేయడం జరిగిందని అన్నారు. చనిపోయిన బాధితులు అందరూ నిరుపేదలు, బలహీన వర్గానికి చెందిన వారిగా ఉన్నారని అన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న కుటుంబాలలో ఇంత భయంకరమైన ఘటన జరిగి తీవ్రంగా నష్టపోయిన కుటుంబాల పట్ల ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం కనీస మానవతా సహాయం కూడా చేయకపోవడం విచారకరమని అన్నారు. 24 గంటలు ప్రభుత్వము నుండి స్పందన వస్తుందని ఎదురు చూశామని, ఏ స్పందన రాకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ఆందోళనకు పూనుకున్నామని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కదిలే ప్రసక్తే లేదని బాధితులకు న్యాయం జరిగేంత వరకు సిపిఎం పార్టీగా ఆందోళన కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. అనంతరం సీపీఎం నాయకులతో నెల్లూరు రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు, నెల్లూరు ఆర్డీవో అనూషలు ఫోన్‌లో చర్చలు జరిపగా ప్రభుత్వం నుండి తక్షణ సహాయంగా 5లక్షల రూపాయలు చెల్లిస్తామని తెలిపారు. ధర్నా చేస్తున్న స్థలం వద్దకు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదని ఆర్డీవోకు నాయకులు తేల్చి చెప్పారు. అనంతరం నెల్లూరు అర్బన్ తహసిల్దార్ షఫీ మాలిక్ ఘటనా స్థలానికి వచ్చి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధితులకు ఒక్కొక్కరికి 5లక్షల రూపాయల చొప్పున చెల్లిస్తామని, అదనంగా మరో 5లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక పంపుతామని హామీ ఇచ్చారు. అంగీకరించిన సిపిఎం నాయకులు బాధితుల కుటుంబసభ్యులు ఆందోళన విరమించి అంత్యక్రియల కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి.సూర్యనారాయణ, సిపిఎం నెల్లూరు నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, బాధితుల బంధువులు, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

# జన సైనికుడు కత్తి బ్రహ్మయ్య ఆర్థిక సహాయం

**సంగం, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గం సంగం మండలంలో పెరమన గ్రామ హైవే లో బుధవారం ఘోర రోడ్డు ప్రమాద ఘటనలో అనంతసాగరం మండలం పడమటి ఖమ్మంపాడు గ్రామానికి చెందిన జనసైనికుడు కత్తి బ్రహ్మయ్య మరణించడం జరిగినది. గురువారం ఆత్మకూరు జనసేన పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు చదలవాడ హరీష్ కుమార్, ఆత్మకూరు జనసేన పార్టీ బృందం మట్టి ఖర్చులకు కత్తి బ్రహ్మయ్య కుటుంబాన్ని పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు ఉదయగిరి రవి, ఆత్మకూరు నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షులు దాడి భాను కిరణ్, ఆత్మకూరు టౌన్ సీనియర్ నాయకులు గడ్డం వంశీకృష్ణ, పల్లవులు శ్రీహరి, దేగ నిరంజన్, సుబ్బు



బాలసుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# కల్వర్టును ఢీ కొట్టినమినీ డీజిల్ ట్యాంకర్

- వ్యక్తి అక్కడికక్కడే మృతి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం ఊటుకూరు సమీపంలో కల్వర్టును ఢీకొని మినీ డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బద్వేల్ నుండి మినీ డీజిల్ ట్యాంకర్ మండలంలోని కస్టర్డ్ దగ్గరకు వస్తూ ఊటుకూరు సమీపంలో రాగానే ప్రమాదవశాత్తు కల్వర్టును ఢీ కొనగా ట్యాంకర్ ముందుభాగం దెబ్బతిన్నడంతో డ్రైవర్ నవీన్ క్యాబిన్లోని ఇరుక్కుపోయారని తెలిపారు మృతుడు నవీన్ (24)కు భార్య పసిబిడ్డ ఉన్నారు. కలిగిరి సీఐ వెంకటరమణ స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన జరిగిన సమాచారాన్ని తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- హసనాపురంలో విషాదఛాయలు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని హసనాపురం గ్రామానికి చెందిన అబ్బూరి వెంకటరావు(28) అనే యువకుడు నెల్లూరులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. 16వ తేదీ మంగళవారం సుమారు మధ్యాహ్నం మూడు నాలుగు గంటల సమయంలో నెల్లూరులోని మేడి కవర్ హాస్పిటల్స్ సమీపంలో రోడ్డు దాటుతూ గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు బంధువులు తెలిపిన వివరాలు ఇలా.. హసనాపురంకి చెందిన అబ్బూరి వెంకటరావు అనే యువకుడు అనంతపురం జిల్లా తాటిపత్రిలో ఓ హైవేలో పనుల వద్ద సివిల్ ఇంజనీర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. అయితే 16వ తేదీ స్వగ్రామమైన హసనాపురంకి వచ్చి నెల్లూరుకు వెళ్లినట్లు తెలిపారు. నెల్లూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అబ్బూరు వెంకటరావు మృతి చెందడంపై స్వగ్రామమైన హసనాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు బుధవారం నెల్లూరులో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. హసనాపురంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే కుమారుడు కావడంతో తల్లిదండ్రులు బంధువులు విలపించారు. మృతుడు అబ్బూరి వెంకటరావు అందరితో కలిసి ఉండేవాడని ప్రమాదంలో మృతి చెందడంపై గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి

# వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ కందికట్టు కోటేశ్వరరావు జ్ఞాపకార్థం సందర్భంగా వారి తమ్ముడైన కందికట్టు నారాయణ కుటుంబ సభ్యులు కలిసి శుక్రవారం సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో కావలి వెంగళరావు నగర్, తుఫాన్ నగర్‌లో నివసిస్తున్న పేద ప్రజలకు భోజనం ప్యాకెట్లను అందించారు. అనంతరం సంస్థ అధ్యక్షులు సురేంద్ర మాట్లాడుతూ.. కందికట్టు నారాయణ సీనియర్ పాత్రికేయులు వారి అన్న జ్ఞాపకార్థంగా గత కొన్ని సంవత్సరాలుగా పేదలకు తమ యొక్క సమస్త ద్వారా అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. మా సంయుక్త సంస్థ ద్వారా పేదలకు ఆకలి తీరుస్తున్న దాతలు కందికట్టు నారాయణబి శ్యామల దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే వారి అన్న కే.కోటేశ్వరరావు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని వారు మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థిస్తున్నామని తెలిపారు.

# ఈ పంట నమోదు తప్పనిసరి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పంటల సాగు చేస్తున్న రైతులు నెలాఖరులోపు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్‌చార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకులు పి.చెన్నారెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. పంట కొనుగోలు చేయాలన్న ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టం పొందాల అన్న ఈ పంట నమోదు ముఖ్యమన్నారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఆత్మకూరులో.. నెత్తురోడ్డుతున్న జాతీయ రహదారులు






పెరమనరోడ్డు వద్ద ప్రమాదానికి గురైన కారు



ప్రమాదంలో మృతిచెందిన మహిళ శవాన్ని తరలిస్తున్నదృశ్యం. ఫైల్‌ఫోటో..



వాసిలివద్ద ప్రమాదమృతదేహం, ఫైల్‌ఫోటో.



పెరమనవద్ద ప్రమాదంలో మృతి చెందిన 7మంది. ఫైల్‌ఫోటో

- ఏడాదిగాన్నరగా 25మంది మృత్యువాత
- దాదాపు 40మంది క్షతగాత్రులు
- రోడ్డు విస్తరిస్తేనే సరీ.. లేదంటే ప్రాణాలు హరీ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రాంతంలో 2024 సంవత్సరంలో, ఈసంవత్సరం ఇప్పటివరకు నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై అనేక ప్రమాదాలు జరిగి అనేకమంది దుర్మరణం పాలై రోడ్డు నెత్తురోడుతోంది. గత ఏడాది రోడ్డుప్రమాదాలు 21 జరగ్గా 9మంది మృత్యువాతబడ్డారు. ఏడాదంతా రోడ్డు నెత్తురోడింది. 9మంది మృతిచెందగా దాదాపు 35 మంది క్షతగాత్రులయ్యారు. ఈసంవత్సరం బుధవారం పెరమన రోడ్డువద్ద జరిగిన ప్రమాదంలో అత్యంత ఘోరం కాగా 7మంది మృతిచెందారు. మేనెలలో ఏఎస్ పేట క్రాస్‌రోడ్డు వద్ద వారంలోపే రెండు ప్రమాదాలు జరిగి ఐదు మంది మృత్యువాతబడగా దాదాపు 10 మంది క్షతగాత్రులయ్యారు. వాసిలి, నెల్లూరుపాళెంల వద్ద జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. తాజాగా గురువారం సిద్దీపురం వద్ద ఒక మోటర్‌సైకిల్ ట్రాక్టరును ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 16మంది మృతిచెందగా దాదాపు 15మంది క్షతగాత్రులయ్యారు. తెల్లారితే ఈప్రాంతంలో ఏం ప్రమాదం జరిగిందో, ఎవరు మృత్యువాతబడ్డారో అని వినాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికంగా నెల్లూరు-ముంబాయి రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈరోడ్డు విశాలంగా ఉండడంతో వాహనాలు అమితవేగంతో నడుపుతుంటారు. అయితే మద్యలో డివైడర్లులేనందున తరచూ ప్రమాదాలు జరుగుతుండగా కొందరు మృతిచెందడం, మరికొందరు



క్షతగాత్రులు ఫైల్‌ఫోటో

క్షతగాత్రులుగా హాస్పిటల్స్‌లో చికిత్సలు పొందడం జరిగింది. ఆత్మకూరు మండలంలో అప్పటికీ పోలీసులు అక్కడక్కడా వేగనిరోధకాలు ఏర్పాటు చేశారు. కానీ ఇంతటి రద్దీగా ఉండే జాతీయరహదారికి డివైడర్లు ఏర్పాటు చేయకపోవడం ప్రమాదాలకు మూలకారణంగా అందరూ భావిస్తున్నారు. ప్రభుత్వాలు నెల్లూరు-ముంబాయి రహదారికి డివైడర్లు ఏర్పాటు చేయడం తదితర భద్రతాచర్యలు తీసుకొనకపోవడం పట్ల సర్వత్రా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిని నాలుగులైన్ల రహదారిగా విస్తరించి మద్యలో డివైడర్లు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకం ఎంతైనా ఉంది. లేదంటే తరచూ ప్రమాదాలు అధికంగా జరగడం జనాల ప్రాణాలు గాలిలో కలిసిపోవడం ఖాయమని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు. బుధవారం పెరమనరోడ్డు వద్ద ఘోరప్రమాదం జరగడం, 7మంది మృతిచెందడం సంఘటనతో వెంటనే స్పందించిన ఈనియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హైవే అధికారులతో మాట్లాడి వెంటనే నాలుగులైన్ల రహదారిగా విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అధికారులు వేగవంతంగా ఈప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని, మంత్రి చొరవతో వెంటనే నిధులు మంజూరు చేయించి రోడ్డును విస్తరించి డివైడర్లు ఏర్పాటు చేయించాలని, ప్రమాదాలు తగ్గించి ప్రజల ప్రాణాలు రక్షించాలని సర్వత్రా కోరుతున్నారు.



## అప్పారావుపాళెంలో పోషణ్‌మా కార్యక్రమం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం అప్పారావుపాళెంలో పోషణ్‌మా కార్యక్రమాన్ని గురువారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కస్తూరి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఈసందర్భంగా కస్తూరి మాట్లాడుతూ స్థూలకాయం నివారణ, బాల్యదశ సంరక్షణ, విద్య, శిశు, చిన్నపిల్లల అలవాట్లు, పిల్లల సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ పి.డి బి.హేనాసుజన్ ఆదేశాలమేరకు సిడిపివో పి.సునీలత ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఊబకాయం సాధారణ ప్రమాదంగా మారిందని, అందులో బాల్య ఊబకాయం అనేది తీవ్రసమస్యగా ఉందని, కొద్ది సంవత్సరాల్లోనే చిన్నారుల ఊబకాయం సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆమె పేర్కొన్నారు. తల్లిదండ్రులు, వారి పిల్లల ఆహారపు అలవాట్లుతోపాటు రోజువారీ దినచర్య, శారీరకశ్రమ, నిద్ర వంటి విషయాల్లో శ్రద్ధ వహించాలని ఆమె తెలిపారు. పిల్లల్లో మంచి ఆహారపుఅలవాట్లను ప్రోత్సహించాలని, జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉంచాలని, ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందించాలని, పిల్లలను అతిగా



తిననివ్వరాదని, తినేటపుడు సెల్‌ఫోన్లు, టివిలకు దూరంగా ఉంచాలని ఆమె సూచించారు. పోషణమాసోత్సవాల ద్వారా అందరూ అవగాహన పెంపొందించుకోవాలని, తమ బిడ్డలకు సరైన మార్గంలో శక్తివంతమైన పోషణను అందించాలని కస్తూరి సూచించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీజ్యోతి, భారతి, విజయరాణి, పలువురు మహిళలు, ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి 2లక్షల చెక్కు పంపిణీ




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం బసవరాజుపాళెంకు చెందిన బక్కముంతల వెంకటరమణయ్య అనారోగ్యంతో మృతిచెందగా పిఎంజెజెబివై పథకం ద్వారా మంజూరైన 2లక్షల రూపాయల చెక్కును గురువారం మహిమలూరు ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ మేనేజర్ ఫిరోజ్ కుమార్ పంపిణీ చేశారు. ఆత్మకూరు ఎస్‌ఎస్‌టి ఆర్గనైజేషన్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ద్వారా జూన్‌నెలలో వెంకటరమణయ్య మృతి గురించి దరఖాస్తు చేయగా పిఎంజెజెబివై ద్వారా 2లక్షల రూపాయలు మంజూర య్యాయి. బ్యాంక్ మేనేజర్ ఫిరోజ్‌కుమార్, ఆర్థిక అక్షరాస్యతకేంద్ర కౌన్సిలర్లు టి.రాజేష్‌కుమార్, డి.విజయ్‌కుమార్, కె.పెంచలస్వామిలు చెక్కును మృతుడు భార్య సుజాతకు అందజేశారు. ఆమె వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## టి.ముస్తాపురంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని టి.ముస్తాపురంలో కొల్లి శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నరేంద్ర మోడీ జన్మదినోత్సవాలను ఈనెల7వతేదీనుండి అక్టోబర్2వతేదీ వరకు నిర్వహించే క్రమంలో గురువారం ముస్తాపురంలో ఈకార్యక్రమం నిర్వహించగా బిజెపి సీనియర్ నాయకుడు, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కుడుముల సుధాకర్‌రెడ్డి అతిథిగా హాజరయ్యారు. తొలుత ప్రధాని మోడీ జన్మదినోత్సవ కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఆనందోత్సాహాలతో కేక్‌ను ఒకరికొకరు తిన్పించుకున్నారు. ఈసందర్భంగా దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు కూడా నిర్వహించి నరేంద్రమోడీకి జన్మదినశుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండునూరేళ్ళు ఆయురారోగ్యాలతో విలసిల్లాలని, దేశానికి మరింతగా సేవలందించాలని వారు ఆకాంక్షించారు. కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులు ప్రసంగిస్తూ భారతదేశానికి విశేషసేవలను అందిస్తూ పాలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారని, మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీగా బిజెపి ఉండగా ప్రధాని రాష్ట్రానికి అనూహ్యంగా అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు సాగునీటిసంఘ వైస్‌చైర్మెన్ దేగా పెంచలరెడ్డి, గ్రామంలోని పలువురు నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపాడు కేజీబీవీలో పచ్చదనం.. పరిశుభ్రత



మర్రిపాడు, మేజర్‌న్యూస్ : మండల కేంద్రమైన మర్రిపాడు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బిజెపి నాయకులు పాఠశాల సిబ్బందితో కలిసి పచ్చదనం.. పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీన్ మాధవ్, బీజేపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు సీపాారెడ్డి వంశీధర్ రెడ్డి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పుట్టేటి సురేందర్ రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ కన్వీనర్ కంధి మల్లికార్జునరెడ్డి పిలుపు మేరకు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 02 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సేవా పక్షోత్సవాలలో భాగంగా మర్రిపాడు లోని కస్తూర్బా బాలికల పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం మర్రిపాడు మండల బీజేపీ అధ్యక్షుడు బోగాల మురళిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్క వ్యక్తి పచ్చదనం పరిరక్షణ బాధ్యత కలిగి ఉండాలని, దీంతోపాటుగా నివాసాల్లో కూడా చెట్లను పెంచే విధంగా కృషి చేయాలన్నారు. అంతేకాకుండా పచ్చదనానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు బేరి విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం నాయకుడు తిరుపతి నాయుడు, ప్రిన్సిపల్ లక్ష్మీదేవి బిజెపి నాయకులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

## బీజేపీ సీనియర్ నాయకులు మారుతి కుమార్ రెడ్డి



పొదలకూరు, మేజర్‌న్యూస్ : భారత ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని 75రోజుల కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన గురువారం పొదలకూరు మండలం బిరదవోలు పంచాయితీలో బిజెపి నాయకులు మొక్కలు నాటే కార్యక్రమం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కిషన్ మోర్చ మాజీ ఉపాధ్యక్షులు బాలిరెడ్డి మారుతీ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు పూల ప్రశాంత్ ఆధ్వర్యంలో సచివాలయం ఆవరణం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలలో మొక్కలు నాటారు. ఈ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం బిరదవోలు సచివాలయంలో ఏర్పాటు చేయాలని భారత ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటాన్ని పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం, దాసరి సురేంద్రబాబు, మండల ఉపాధ్యక్షుడు చొప్ప వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి అక్కెం జనార్దన్ రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు గురుస్వామి, టౌన్ అధ్యక్షులు సిరిగిరి ఓబులేష్, అయోధ్య రామయ్యగౌడ్, అక్కెం రమణారెడ్డి, రవీంద్ర, రమణమ్మ, బుధరపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పీఎంఏవై 2.0 అంగీకార పోస్టర్ ఆవిష్కరణ




కావలి, మేజర్‌న్యూస్ : కావలి పట్టణంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకాన్ని ప్రజలకు అతి దగ్గరగా చేయడమే లక్ష్యంగా అంగీకార పోస్టర్‌ను కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. పిఎంఏవై పథకం కింద అర్హులైన నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించడం కేంద్ర ప్రభుత్వం యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇల్లు ప్రతి కుటుంబానికి ఒక కలని ఆ ఆ కలలో తీర్చడమే ఈ యొక్క పథకం యొక్క ముఖ్య ఉద్దేశం అని ఈ పథకం ద్వారానే పేద ఇంటి కల నెరవేరుతుందని తెలిపారు. అలాగే కావలి పట్టణ పరిధిలో అనేక కుటుంబాలు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని ఆయన తెలిపారు. అంగీకార పోస్టర్ ద్వారా ప్రజల్లో హౌసింగ్ పథకం గురించి పూర్తి అవగాహన కలుగుతుందని అర్హులైన వారు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పథకం అమలులో పారదర్శకత కోసం అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది హౌసింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపఖజానా కార్యాలయం తనిఖీ : డీడీ గంగాద్రి



ఉదయగిరి, మేజర్‌న్యూస్ : స్థానిక ఉప ఖజానా కార్యాలయాన్ని గురువారం జిల్లా ఖజానా కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ డి.గంగాద్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్షిక తనిఖీలో భాగంగా కార్యాలయాన్ని సందర్శించడం జరిగిందన్నారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ బాగుందన్నారు. పెన్షనర్లకు, ఉద్యోగులకు కార్యాలయ అధికారులుమెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యాలయానికి వచ్చే వారి పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, సకాలంలో పనులు చేసి పెట్టాలన్నారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులు డేడిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప ఖజానా అధికారి ఉస్మాన్, సీనియర్ అకౌంటెంట్లు శ్రీనివాసులు, ప్రసాదు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి టిప్పర్లతో గ్రావెల్ తరలింపు

## ▶ పట్టించుకోని అధికార యంత్రాంగం



కావలి, మేజర్‌న్యూస్ : కావలి గ్రామీణ ప్రాంతాలలో యదేచ్ఛగా గ్రావెల్ ను మాఫియా అర్ధరాత్రులు టిప్పర్లతో తరలించడం పెద్ద పవన్ రోడ్డు లోని ప్రాంతంలోనే కొంతమంది ప్రజలు అడ్డుకోవడం జరిగింది. కావలి గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది గ్రావెల్ మాఫియా టిప్పర్లతో యదేచ్ఛగా లేఔట్లకు తోలుతూ అక్రమాలకు పాల్పడుతున్నప్పటికీ, అధికార యంత్రాంగం మాత్రం చూసి చూడనట్టుగా తమ కార్యకలాపాలు జరుపుకుంటున్నారు. ఒక ప్రక్క అవినీతి లేని పరిపాలన అందించాలని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సభలలో, సమావేశంలో అధికారులకు ప్రజలకు సూచనలు ఇస్తున్నప్పటికీ ఈ అక్రమ గ్రావెల్ మాఫియాని నియంత్రించలేకపోతున్నారు. ఇది ఎవరి వైఫల్యం అనేది ప్రశ్నార్థకం. రాత్రి సమయాల్లో ఈ గ్రామాలను తరలిస్తుంటే అక్కడ ప్రజలు అడ్డుకొని నివారించడం జరుగుతుంది. అధికారులకు ఆ సమయంలో సమాచారం. ఇప్పించినప్పటికీ కూడా మౌనముగా ఉండడం విశేషం. ఈ అక్రమ గ్రావెల్ తరలింపును నివారించడానికి ఆ దేవుడే మార్గం అంటున్న ప్రజలు.

# స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని సందర్శించిన ఎంఈఓ



కావలి, మేజర్‌న్యూస్ : కావలి మండలం కట్టకింద పాలెం మండల ప్రజా పరిషత్ పాఠశాలను స్వచ్ఛత పక్వాడ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కావలి మండల ఎంఈఓ బి.గోవిందయ్య ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చేతులు కడుక్కోవడం, నీటి సంరక్షణ గురించి క్షుణ్ణంగా వివరించడం జరిగింది. స్వచ్ఛత యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థుల సామర్థ్యాలను వారు పరిశీలించారు. పాఠశాలల్లో కాపాడుతున్న ఎఫ్ఎల్ఎన్, టిఎఆర్ఎల్ మెటీరియల్ను ఉపయోగించే విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో డొక్కా సీతమ్మ పథకం ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె మునీర్ జాన్, ఉపాధ్యాయులు ఏ.వెంకటేశ్వర్లు సిఆర్ఎంటి ఎం.బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గంధం దంచే కార్యక్రమం



అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ : మండల కేంద్రమైన ఏఎస్ పేట లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ సయ్యద్ రహమతుల్లా నాయబ్ రసూల్, వారి 252వ గంధ మహోత్సవంలో భాగంగా గంధం దంచే కార్యక్రమాన్ని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో దర్గా ఈవో షేక్ మొహమ్మద్ హుస్సేన్, ఏజీవన్ ఫయాజ్ అహ్మద్, ప్రత్యేక ఫాతిహాలు చదివి ప్రారంభించారు. ఏడాదికోసారి జరిగే ఈ కార్యక్రమంలో గంధం దంచడానికి మహిళా భక్తులు భారీగా పాల్గొని భక్తిశ్రద్ధలతో గంధం దంచారు. అలాగే భక్తులకు వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో క్యూలైన్ల కొరకు బారికెట్లు షామియానాలు తదితర ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ అనిల్ కుమార్, నాయకులు షేక్ జిలాని బాషా షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వస్త్ నారీ.. సశక్త్ పరివార్

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం కాటేపల్లి పంచాయతీ కాటేపల్లి గ్రామంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమాన్ని చేపట్టి దేశ ప్రజలకు ఆరోగ్యపరమైన జీవితాన్ని అందించే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చాకలికొండ పిహెచ్సి డాక్టర్ మురళీధర్ పేర్కొన్నారు. వింజమూరు మండల పరిధిలోనీ కాటేపల్లి పంచాయతీలో స్వస్త్ నారీ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ.. ప్రతి పల్లె ఆరోగ్యకరమైన జీవితాన్ని ఏర్పరచుకోవాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలియజేశారు. ఆరోగ్యవంతమైన మహిళలు శక్తివంతమైన కుటుంబం అవలంభించడంలో ప్రధాన పాత్ర వహిస్తారు అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆరోగ్యవంతమైన సేవలను సులభతరం చేయడంలో ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఆరోగ్యకర విషయాలకు సంబంధించి చక్కెర, వంట నూనెలను 10శాతం తగ్గించడం ద్వారా తగ్గించవచ్చు స్థానిక, ప్రాంతీయ ఆహారాన్ని ప్రోత్సహించాలి. ప్రారంభ బాల్య సంరక్షణ, శిశువు చిన్నపిల్లల ఆహార పద్ధతులను మార్చుకోవాలని అన్నారు రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.



ప్రధానమంత్రి మాతృ వందన యోజన నమోదు ఆయుష్మాన్ వయో వందనకార్డులో సికేల్ సెల్ కార్డులో లబ్ధిదారుల నమోదుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి తగు సలహాలు సూచనలు ఇచ్చి ఆరోగ్యవంతమైన జీవితంలో భాగస్వామ్యం అవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సక్కుబాయమ్మ పిఎస్ నరసింహారెడ్డి హెచ్ఈఓ వెంకటేశ్వర్లు హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, కూటమి నాయకులు కాటేపల్లి పంచాయతీ అధ్యక్షులు ఉప్పుటూరి వెంకటరత్నం డబ్బు కొట్టి హరిబాబు మాజీ ఎంపీటీసీ ఎం.పెద రాఘవరెడ్డి, చిన రాఘవరెడ్డి పంచాయతీ కోఆర్డినేటర్ గుండుబోయిన మాధవ గంగిరెడ్డి మణిరత్నం కొండలరావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేలో తప్పిదాలను సరిచేయాలని రైతుల ఆందోళన




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** భూ రేసర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేయాలని గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బండ గానిపల్లి పంచాయతీ రైతులు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. రైతులకు పూర్వం నుండి వచ్చిన సెటిల్మెంట్ భూములకు సంబంధించి జరిగిన భూ రీసర్వేలో అనేక పొరపాట్లు జరగడంతో వన్‌బి, అడంగల్ మీ సేవ, సచివాలయాల్లో రాకపోవడంతో రైతులు అనే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫలితంగా రైతు సంక్షేమ పథకాలు పలువురు రైతులకు అందడం లేదన్నారు. సమస్యను పరిష్కరించాలని ఎన్నోసార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించిన పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించిన భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రైతుల పొలాలకు సంబంధించి రెవెన్యూ రికార్డులు రాకపోవడంతో బ్యాంకర్లు రైతులకు రుణాలు మంజూరు చేయడం లేదన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలపై రైతులు తీసుకున్న బంగారు రుణాలను ఈ షెడ్యూల్ చేయకుండా రుణ నగదు పూర్తిగా చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారన్నారు. భూమిల విషయంలో రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేసిన్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్పందించిన తహసిల్దార్ ఎల్.రామ్మోహన్ మాట్లాడుతూ.. రీ సర్వేలో అన్యాయం జరిగిన రైతుల జాబితాను తనకు అందించాలని, పరిశీలించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## మాకు రహదారి సౌకర్యం కల్పించండి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు ఎదురుగా నివాసముంటున్న కొన్ని కుటుంబాల వారు మాకు రహదారి సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంత మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని, రహదారి సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందుల గురవుతున్నామని, ఇప్పటికైనాను ఏ ఒక్క అధికారి గాని మూడు నెలలు ప్రజాప్రతినిధి గాని పట్టించుకున్న దాఖలాలు లేవని వారు వాపోతున్నారు. మూడు నెలల నుండి తహసిల్దార్‌కు పోలీస్ శాఖ వారికి దరఖాస్తు చేసుకొని మొరపెట్టుకున్నా కూడా ఎలాంటి ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మాకు న్యాయం జరిగేంత వరకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని వారు తెలిపారు. కొందరు ఈ విషయాన్ని రాజకీయం చేస్తున్నారని అది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కలిగిరి సీఐ వెంకటరమణ అక్కడ చేరుకొని ఇది రెవెన్యూ పంచాయతీకి సంబంధించిన విషయమని అక్కడే తీర్చుకోవాల్సి ఉందన్నారు సీఐ సర్దుబాటు చేయడంతో నిరసనలు విరమించి వెళ్లారు ఇప్పటికైనాను అధికారులు ప్రజాప్రతినిధులు పరిశీలించి న్యాయం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రావూరి రమణారెడ్డి సుశీల సుబ్బమ్మ వనజ రత్తమ్మ ఇతర మహిళలు తదితరులు ఉన్నారు.

## జిల్లా కామన్‌బోర్డు కార్యదర్శిగా ఫణీష్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా కామన్‌ఎగ్జాపమినేషన్ బోర్డు కార్యదర్శిగా కె.ఫణీష్ నియమితులయ్యారని ఏపికాట్వా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు పేర్కొంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. తనకు బియిడిలో క్లాస్‌మేట్ అయిన ఫణీష్ అత్యంత సీనియర్, విజ్ఞానవంతుడు, అంకితభావం, సమర్థత కలిగిన వారని, ఉపాధ్యాయవృత్తిలో మంచి పేరు గడించారని, ఆయన జిల్లా డిసియిబి కార్యదర్శిగా నియమితులుకావం హర్షదాయకెమని సుబ్బారావు పేర్కొన్నారు. ఫణీష్‌ను అజయ్‌బాబు, వెంకటేశ్వర్లు, శ్రీధర్, ఫణీంద్రజోయల్, రమేష్‌బాబు, వెంకటేశ్వరరావు, అశ్వనీకుమార్, చక్రవర్తి, వెంకటాద్రి, రఘు తదితరులు కూడా అభినందించారు.

## కలెక్టర్‌ను అభినందించిన రెవిన్యూఅసోసియేషన్ ప్రతినిధులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హమాన్స్‌శుక్లాను గురువారం రెవిన్యూసర్వీసెస్ నాయకులు కలిసి శాలువా,పుష్పగుచ్ఛంలతో సన్మానించి అభినందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరుకు చెందిన జిల్లా కమిటీ ప్రతినిధి డి.వి.శేషయ్య కూడా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ప్రతినిధులు ఆనందప, బాలకోటమ్మ, వెంకటేష్, డానియేల్‌లున్నారని శేషయ్య పేర్కొన్నారు.

# స్త్రీ ఆ రోగ్యం.. కుటుంబ సౌభాగ్యం

▸ హెూమియోవైద్యులు డా కరుణాకర్



**నెల్లుర్ సిటీ, మేజర్‌న్యూస్ :** స్వస్త్ నారి ససక్త్ నారి పరివార్ కార్యక్రమాన్ని ఇనమడుగు ప్రాధమిక ఆరోగ్యకేంద్రములో నిర్వహించారు. ఇక్కడ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు కోల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి ఇతర ముఖ్యనాయకులు పాల్గొన్నారు. నారాయణ వైద్యశాల స్పెషలిస్ట్ డాక్టర్ల ఆద్యర్యంలో ఆరోగ్యసేవలను ప్రాధమిక వైద్యాదికారులో ఏర్పాటు చేశారు. అందులో ఉచిత హెూమియో వైద్యశిబిరాన్ని హెూమియో వైద్యులు కరుణాకర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఆరోగ్యపరిక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. స్త్రీ ఆరోగ్యంగా ఉంటె కుటుంబం సౌభాగ్యంగా ఉంటుంది. కుటుంబ ఆనందానికి స్త్రీనే ముఖ్యకారణం కనుక వారు ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిస్తు ఏలాంటి జాగ్రత్తలు తీసుకోవలో వివరించారు. డా కరుణాకర్ ఇంకా కాంపౌండర్ బాషా, ఎంఎన్ఓ రామక్రిష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నోడల్ ఆఫిసర్ సరళాహెబ్సిబా సందర్శించారు.

## అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు : కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక గుడిపల్లి పాడు ప్రాంతాలోని సాయి బృందావనం లేఅవుట్‌ను గురువారం పరిశీలించారు. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు లేని నిర్మాణాలను వెంటనే ఆపివేయాలని, నిర్మాణ పనులు చేపట్టకుండా నిరంతరం టౌన్ ప్లానింగ్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాల్సిన వస్తోందని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్‌ఈ రామ్మోహన్ రావు, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఆటలు, క్రీడలు బహుళప్రయోజనకరం : ఎఈఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు ఆటలు, క్రీడలు బహుళ ప్రయోజనకరమని ఆత్మకూరు మండల విద్యాశాఖాధికారిణి సిహెచ్ అనంతలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలోని క్రీడామైదానంలో గురువారం స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు ఆటలు, క్రీడలపట్ల కూడా ఆసక్తి చూపాలని, తద్వారా ఆరోగ్యం, దేహదారుఢ్యం, మానసిక ప్రశాంతత, మానసికోల్లాసం అభిస్తాయని, విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందని అనంతలక్ష్మి పేర్కొన్నారు. ఈపోటీల్లో అండర్14,అండర్17 విభాగాల్లో అన్ని పాఠశాలలకు చెందిన 250మంది హాజరయ్యారు. ఖోఖో, కబడ్డి, వాలీబాల్, యోగ, అథ్లెటిక్స్ అంశాల్లో ఈపోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ కె.వి.కృష్ణ, మండలంలోని అందరు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమన్వయ కృషితోనే జిల్లా సమగ్ర అభివృద్ధి : జిల్లా కలెక్టర్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయ కృషితోనే గ్రామాల అభివృద్ధి, తద్వారా జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. గురువారం కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ చాంబర్లో డిఆర్డిఏ, డ్వామా, పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్ శాఖల సమీక్ష సమావేశం ను జిల్లా కలెక్టర్ నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, వాటిని సక్రమంగా అమలు చేసి అన్ని విభాగాల్లో జిల్లాను ముందంజలో ఉంచేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు అన్నివేళలా అందిస్తామన్నారు. వివిధ రకాల కార్యక్రమాల ప్రతిపాదనల తయారీకి ముందే ఆయా స్టేట్ హోల్డర్స్ తో చర్చించిన అనంతరమే ప్రతిపాదించాలన్నారు. అలాగే పంచాయతీలలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించుటలో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్, కిచెన్ గార్డెన్స్, ఇంటింటి చెత్త సేకరణ, గ్రీన్ అంబాసిడర్స్, ఆరోగ్యకరమైన జీవన విధానం ప్రోత్సహించటం తదితరాల గురించి దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలలో మ్యాజిక్ డ్రైన్స్ నిర్మించేందుకు నాలుగు గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలోని బిసి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్స్‌లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ, డ్వామా పిడీలు నాగరాజ కుమారి, గంగాభవాని, డిపిఓ శ్రీధర్ రెడ్డి, జడ్పీ సీఈవో మోహన్ రావు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ లు కోటేశ్వరరావు, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జిని కలసిన కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా కోర్టులోని ఆయన ఛాంబర్‌లో గురువారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా న్యాయమూర్తికి ఒక మొక్కను మర్యాదపూర్వకంగా ఇచ్చారు. జిల్లా కలెక్టరను సాదరంగా జిల్లా జడ్జి ఛాంబర్‌లోకి ఆహ్వానించారు. జిల్లా లోని పలు రెవెన్యూ విషయాలను ఇరువురు చర్చించారు.

## పోలీసుల అదుపులో ఇద్దరు మహిళా దొంగలు !

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరులో పట్టణంలో బంగారు దుకాణాల వద్ద అనుమానంగా తిరుగుతున్న ఇద్దరు మహిళా దొంగలను వ్యాపారస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. సేకరించిన సామాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గత నెలరోజులుగా కొందరు మహిళలు పొదలకూరు బంగారు దుకాణాలలో నగలు కొనుకోలు చేస్తున్నట్లు నటిస్తూ ఆపహరించుకెళు తున్నారు. దీంతో అనుమానాస్పదంగా దుకాణాల వద్ద తిరుగాడుతున్న ఇద్దరు మహిళలను వ్యాపారస్తులు పట్టుకుని పోలీసులకు చెప్పారు. ఓ మహిళ పరారైనట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు మహిళా దొంగలు కృష్ణా జిల్లా వీర్లపాడుకు చెందిన జ్ఞానమ్మ, అదెమ్మ లు పోలీసులు గుర్తించారు. కాగా వీరిపై గతంలో పలు కేసులు నమోదై ఉన్నట్లు సమాచారం. వీరి నుంచి 7జతలు బంగారు కమ్మలు స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

# మంత్రి ఆనం సారధ్యంలో ప్రగతిపట్టాలపై పరుగులు తీస్తున్న ఆత్మకూరు అభివృద్ధి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో గత 10సంవత్సరాలుగా పడకేసి ఉండగా ఏడాదిన్నర క్రితం శాసనసభ్యులుగా ఎన్నికైన రాష్ట్ర దేవాదాయశాఖా మాత్యులు ఆనం రామ నారాయణ రెడ్డి అమిత వేగంగా ప్రగతిని పట్టాలెక్కించి పరుగులు తీయిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే సంక్షేమంతోపాటు అనూహ్యంగా సమాంతరంగా అభివృద్ధి సాధిస్తున్నారు. గతంలో రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా వ్యవహరించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖామాత్యులుగా వ్యవహరించారు. అప్పట్లో ఆత్మకూరు నియోజకవర్గానికి దాదాపు 2500కోట్ల రూపాయల నిధులు సాధించి అనేక రహదారులు, వంతెనలు, భవనాలు నిర్మించడంతో పాటు ప్రాంతీయవైద్యశాలను, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను, రెవిన్యూ డివిజన్, మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కస్తూర్భాపాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, ఐటిఐలు సాధించారు. ఆత్మకూరులో అభివృద్ధికి చిహ్నం ఆనం అనే నానుడి జనాల్లో బలంగా నాటుకుపోయింది. 2024 ఎన్నికల్లో ఆయన టిడిపి తరపున అభ్యర్థికాగానే వైసిపి బలంగా ఉన్న ఈ నియోజకవర్గంలో అభివృద్ధి ప్రదాత వచ్చారు. ఆయన ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తే ప్రగతి పరుగులు తీస్తుందని అందరూ విశ్వశించి అనూహ్యంగా అన్నివర్గాలు ఆయనకు బాసటగా నిలిచి విజయం కట్టబెట్టారు. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక సీనియర్‌గా, గతంలో అనేక మంత్రిత్వశాఖలు నిర్వహించిన నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుర్తించి ఆయనకు దేవాదాయమంత్రిగా ఎంపికచేశారు. ఆయన పదవి చేపట్టి ఏడాదిన్నర కాగా తన రాజకీయ, పాలనానుభవంతో ముఖ్యమంత్రి సాన్నిహిత్యంతో, సహచర మంత్రుల సహకారంతో ఆత్మకూరు అభివృద్ధికి కంకణ దారుడయ్యారు. టిడ్కో గృహాల్లో రామాలయాన్ని సాధించారు. పంచాయతీరాజ్ అతిధిగృహానికి 1.7కోట్ల రూపాయల నిధులు సాధించి శంఖుస్థాపన గావించగా పనులు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బి అతిధిగృహం నిర్మాణం నిలిచిపోయి ఉండగా నిధులు సాధించి పూర్తిచేయించి ప్రారంభింపజేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్డు, డ్రైనేజిలకు దాదాపు 65కోట్ల రూపాయలు సాధించారు. నిలిచిపోయి ఉన్న సోమశిల హైలెల్‌కెనాల్ నిర్మాణాలు, సోమశిల ప్రాజెక్టు ఆప్రాన్‌పనులకు నిధులు అధికంగా సాధించి ప్రారంభింపజేశారు. నియోజకవర్గంలో సిమెంటురోడ్ల నిర్మాణానికి కోట్లాదిరూపాయలను ఉపాధిహామీపధకం ద్వారా మంత్రి ఆనం సాధించగా ఇప్పటికే అనేక రోడ్ల నిర్మాణాలు పూర్తికాగా పలురోడ్లు నిర్మాణంలో ఉన్నాయి. చెరువులు, కాలువల అభివృద్ధికి దాదాపు 100కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆత్మకూరులో ఆయన మంజూరు చేయించిన 100 పడకల హాస్పిటల్ ఆయన ప్రతిపాదన,కృషితో జిల్లా వైద్యశాలగా అప్‌గ్రేడ్ కాగా అన్నీ వసతులు సమకూర్చ లేదని ముఖ్యమంత్రి, వైద్యశాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్ళి 300పడకల హాస్పటల్‌గా అభివృద్ధిచేసేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ అతికొద్ది సమయంలోనే ముఖ్యమంత్రిని 2దపాలు ఆత్మ కూరు నియోజకవర్గానికి రప్పించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారంచుట్టడంతోపాటు పలు హామీలు పొందారు. ఐదారు మంది మంత్రులను ఆత్మకూరుకు రప్పించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును ఆత్మకూరుకు రప్పించి నారంపేటవద్ద పారిశ్రామిక పార్కును ప్రారంభింపజేయడంతో అనేక పరిశ్రమాలు ఇక్కడ ఏర్పాటుకు అవకాశం ఏర్పడడంతోపాటు ముఖ్య మంత్రి హామీ కూడా లభించింది. దాంతో పరిశ్రమలు రాగవలన్న విశ్వాసం, వేలాదిమంది నిరుద్యోగయువతకు ఉద్యోగావకాశాలు లబించగలవన్న నమ్మకం జనాల్లో బలంగా ఏర్పడింది. నడికుడి–శ్రీకాళహస్తి రైలుమార్గం నత్తనడకన ఉండగా మంత్రి ఆనం దృష్టి సారించారు. త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయగా ముఖ్యమంత్రి కూడా ఇటీవల ఆత్మ కూరులో హామీ ఇచ్చారు. ఆత్మకూరు చెరువువద్ద సుంద రీకరణకు, పట్టణం శివార్లలో బైపాస్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వం నుండి నిధు లు సాధించే యత్నంలో మంత్రి రామనారాయణరెడ్డి ఉన్నారు. పట్టణ బైపాస్‌రోడ్డు విస్తరణకు ఆయన 6.5కోట్ల రూపాయలు నిధులు సాధించగా టెండర్ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు 130 దేవాలయాల అభివృద్ధికి దాదాపు 7కోట్లు, 10 విద్యాసంస్థల అభివృద్ధికి 1.03కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. గత 10సంవత్స రాలుగా ఆత్మకూరులో ఎలాంటి అభివృద్ధి లేకుండా ఉన్న విషయం తెల్సిందే కాగా గతంలో నారంపేట వద్ద ఒక పరిశ్రమ ఏర్పాటు అంటూ శిలాఫలకం వైసిపి ప్రభుత్వం వేసినా ఆ పరిశ్రమను అప్పటి ముఖ్యమంత్రి తమ స్వంత జిల్లా కడపజిల్లాకు తరలించుకోవడం తెల్పిం దేకాగా రామనారాయణరెడ్డి నారంపేట పార్కును అభివృద్ధి చేయించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా ప్రారంభించి పలు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని సాక్షాత్తు ముఖ్యమంత్రితోనే హామీ ఇప్పించారు. అభివృద్ధిప్రధాతగా పేరుగాంచిన ఆనం రామనారాయణరెడ్డి ఈఏడాది కాలంలోనే చేస్తున్న కృషి, పట్టుదల, సంకల్పం, లక్ష్యం చూస్తుంటే ఆత్మకూరు అభివృద్ధిని గతంలో పరుగులు తీయించిన మంత్రి నేడు ప్రగతిని పట్టాలెక్కిస్తున్నారని, ఇక స్పీడందుకుంటుందని, అనూహ్యంగా ఆత్మకూరు అభివృద్ధి సాధ్యమవుతుందని సర్వత్రా భావిస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్ పేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాలు జనాలు ఆశించినదానికన్నా మరింతగా అభివృద్ధి సాధ్యమని అందరూ ఎంతో విశ్వాసంగా ఉన్నారు. ఆయన పార్టీపరంగా సభ్యత్వనమోదు, ఇతర పార్టీ కార్యకలాపాల్లో ప్రత్యేకంగా శ్రద్ధచూపుతూ రాష్ట్రంలోనే ద్వితియ స్థానంపొందారు. ఆయనకు దేవాదాయశాఖను ముఖ్యమంత్రి అప్పగించగా నిరంతరం పర్యటిస్తూ రాష్ట్ర అధికారులతో సమీక్షిస్తూ పలు సంస్కరణలు, నిర్ణయాలు తదితరాలతో ఆయన బాధ్యతలను 100శాతం నిర్వహించారన్న పరిస్థితి అటు ప్రభుత్వ అధినేత వద్ద రికార్డు అయిందని కూడా తెలుస్తోంది. ఏదేమైనా ఆత్మకూరు అభివృద్ధి అంటే ఆనంతో సాధ్యం అన్న నానుడి నిజం కాగలదని సర్వత్రా భావిస్తున్నారు.

### నాడు 11 విద్యాసంస్థల మంజూరు

రాష్ట్రదేవాదాయశాఖామంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పట్టుదల, ప్రత్యేక కృషితో ఆత్మకూరుకు విక్రమసింహపురి ఇంజనీరింగ్‌కాలేజి మంజూరైంది. ఈమేరకు విద్యాశాఖామంత్రి నారాలోకేష్ ఆమోదం తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుండే అడ్మిషన్లు జరుగుతాయని చెబుతున్నారు. మంత్రి ఆనం కృషితో ఈ నియోజకవర్గానికి ప్రభుత్వసాంకేతికవిద్యను అందించేలా విక్రమసింహపురి ఇంజనీరింగ్‌కాలేజి మంజూరైందని సర్వత్రా భావిస్తూ హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. 2025–26విద్యాసంవత్సరానికే ఈకాలేజిలో ఇంజనీరింగ్ కళాశాలలో 300మంది విద్యార్థులతో బిటెక్ కోర్సులు ఐదు విభాగాల్లో ప్రారంభానికి నారాలోకేష్ ఆమోదం తెలిపారు. ఎన్‌డిఏ ప్రభుత్వం తొలిఏడాదిలోనే ఎన్నికల సమయంలో, అనంతరం ముఖ్యమంత్రి హోదాలో ఆత్మకూరుకు విచ్చేసినపుడు ఆనం రామ నారాయణరెడ్డి విన్నపం చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కాలేజిని మంజూరు చేశారు. తాత్కాలికంగా ఈ కాలేజిని నెల్లూరులోని విఆర్‌ఏపిఎస్ కాలేజి భవనాల్లో తరగతులు నిర్వహిస్తారని, రెండేళ్ళలోపు ఆత్మకూరులో నూతన భవనాలు నిర్మించిన అనంతరం ఇక్కడ తరగతులు నిర్వహిస్థారని మంత్రి ఆనం పేర్కొన్నారు. విద్యారంగంలో మంత్రి ఆనం చొరవకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆత్మకూరు యువతకు తమ సొంత నియోజకవర్గంలోనే గుణాత్మకసాంకేతిక విద్య అందించేందుకు మార్గం ఏర్పడింది. ఆనం ముందస్తు దృష్టితో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన బాట ఏర్పాటుకానుంది. పేద, గ్రామీణ యువత ఇంజనీరింగ్ విద్యను అందుకునే అవకాశం ఏర్పడింది. యువత ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా విద్యారంగంలో అంకితభావంతో మంత్రి ఆనం అడుగులు వేస్తున్నారు. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు తదుపరి తరాలకు ఆదర్శంగా నిలవనున్నాయి.ఆత్మకూరునుండే టెక్నాలజి మార్గంలో ఎంతోమంది యువత ముందుకు సాగేరోజు దరిచేరింది. ఆత్మకూరు నియోజకవర్గంలో 2009లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఎన్నికై ఉమ్మడిఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖామంత్రిగా కొనసాగారు. ఆసమయంలో రామ నారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో దాదాపు 2000కోట్లరూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి అభివృద్ధిప్రదాతగా పేరుగాంచారు. అప్పట్లో ఆత్మకూరు రెవిన్యూ డివిజన్, మున్సిపాలిటీ, ప్రాంతీయవైద్యశాల, మార్కెట్లు, అనేక కార్యాలయాల భవనాలు, పెన్నానదిపై అతిపెద్ద వంతెన, అనేక రోడ్లు, భవనాలు, వంతెనలు, సాగు, త్రాగునీటి పధకాలు సాధించారు.

# సప్తగిరి లేఅవుట్ పై ఫిర్యాదుతో స్పందించిన కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న ఫిర్యాదుపై స్థానిక 22వ డివిజన్ వేదాయపాలెం ప్రాంతంలోని సప్తగిరి లేఅవుట్‌కు సంబంధించి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గురువారం వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. డివిజన్ పరిధిలో ఆస్తి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, తాగునీటి కొళాయి, డ్రైనేజీ పన్నులను క్రమం తప్పకుండా వసూలు చేసి, నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించాలని రెవెన్యూ విభాగం అధికారులు వార్డు అడ్మిన్ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. డివిజన్ పరిధిలో డ్రైను కాలువలు ఆక్రమణలకు గురి కాకుండా కాలువలపై మెట్లు, ర్యాంపులు, తదితర ఎలాంటి నిర్మాణాలు జరగకుండా పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణాలను తొలగించి వేస్తామని హెచ్చరికలు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. డివిజన్ పరిధిలో అపరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహిస్తున్న హోటల్ ప్రాంగణాన్ని కమిషనర్ పరిశీలించి నిర్వాహకులకు 5వేల రూపాయల జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేయకుండా శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకోవాలని, ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను ప్రజలు అందించేలా నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలలో డస్ట్ బిన్లను ఏర్పాటు చేసే బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేయకుండా అడ్డుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవిన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ భువనేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న వేమిరెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** భక్తుల కోర్కెలు తీర్చే చల్లని తల్లి, శక్తి స్వరూపిణి శ్రీశ్రీశ్రీ భువనేశ్వరి అమ్మవారిని గురువారం నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. నగరంలోని మైపాడు గేట్ కిసాన్ నగర్లోని భవాని నగర్ నందు గల శ్రీ భువనేశ్వరి సమేత అభయ మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి, స్వామివారికి వీబీఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వేమిరెడ్డిని ఘనంగా సత్కరించి శాలువాలతో సన్మానించారు. ఆ తల్లి చల్లని ఆశీస్సులు అందరిపై ఉండాలని వేమిరెడ్డి ఆకాంక్షించారు. ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాద వినియోగాలు అందజేసి వేద ఆశీర్వచనాలు అందించారు. అనంతరం శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించనున్న ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన విబిఆర్ భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలను ఆదుకోవాలి

- ఇసుకదందాలపై దృష్టి సారించాలి
- అసలు దోషులను శిక్షించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన 7మంది పేద దళితకుటుంబాలను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని, ఈప్రాంతంలో ఇసుకదందాలపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని, ప్రమాదానికి కారణమైన అసలు నిందితులను గుర్తించి వెంటనే శిక్షించాలని ఆత్మకూరుకు చెందిన వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరులోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు ప్రసంగించారు. ప్రతాప్‌రెడ్డి ప్రసంగిస్తూ కొందరు అధికారపార్టీనాయకులు ధనదాహంతో ఈప్రాంతంలో ఇసుకదందా కొనసాగిస్తున్నారని, ఆ ఇసుక లారీ కారును ఢీకొనడంతోనే పేద దళితులైన 7మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రభుత్వం వెంటనే ఘోరమైన ఈసంఘటనలో మృత్యువాతబడిన 7మంది కుటుంబాలను ఆదుకోవాలని, ఒక్కో మృతుని కుటుంబానికి 50లక్షల రూపాయలవంతున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆయన కుటుంబాల్లో చిన్నారులుంటే ప్రభుత్వమే విద్యాభ్యాసం చేయించాలని, ఒక్కో కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగావకాశం కల్పించాలని ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. మృతిచెందిన వారి ప్రాణాలను ఎవరూ తీసుకురాలేరని, సంతాపాలతో ఆకుటుంబాలకు ఏమీ ప్రయోజనం ఉండబోదని,నిరాశ్రయులైన ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాగులపాటి పేర్కొన్నారు. ఈసంఘటనకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. వైసిపి ఎస్‌సిసెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో రెండు దళితకుటుంబాలకు చెందిన 7మంది మృతిచెందడం హృదయవిదారకమన్నారు. ఈప్రమాదంలో ఇసుకలారీ కారును ఢీకొనడంతో 7మంది మృత్యువాతబడ్డారని, సంఘటనకు కారుకులైన ఇసుకదందా నిర్వహించే వారిని గుర్తించాలని, అసలు దోషులను తప్పకుండా శిక్షించాలని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం 50లక్షలవంతున, ఇసుకవాహనం యజమాని 25లక్షలవంతున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వైసిపి న్యాయవాదుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నందా ఓబులేశు మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతంలో సంగం, పడమటికంభంపాడు, అప్పారావుపాళెంల వద్ద ఇసుకరీచ్‌లు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుకను అక్రమంగా పెద్దపెద్ద వాహనాల్లో తరలిస్తుంటారన్నారు. ఇసుకను తరలిస్తున్న ఒక టర్బోవాహనం బుధవారం సంగం వైపు వెళుతూ ఎదురుగా వస్తున్న కారును రాంగ్‌రూట్‌లో వెళ్ళి ఢీకొనడంతో 7మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అసలు ఇసుకను ఆత్మకూరు వైపునుండి సంగం వైపు ఎందుకు తరలించారని ఆయన ప్రశ్నించారు. అధికారపార్టీ నాయకులు సమాధానమివ్వాలన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అన్ని శాఖల అధికారులు మామూళ్ళ మత్తులో చోద్యం చూస్తున్నారని ఆయన విమర్శించారు. ఆత్మకూరు ప్రాంతంలో ఇసుక, మట్టి మాఫియాల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో శాప్ మాజీ డైరెక్టర్ కాలువ నరశింహులు ప్రసంగించగా వైసిపి మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, అనంతసాగరం, మర్రిపాడు, సంగం మండలాల వైసిపి అధ్యక్షులు బిజివేముల పిచ్చిరెడ్డి, చెన్ను వెంకటేశ్వరరెడ్డి, పులగం శంకర్‌రెడ్డి, జిల్లా వైసిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిమి రమేష్‌రెడ్డి, అనంతసాగరం ఉపమండలాధ్యక్షుడు శ్రీనివాసులు, వైసిపి నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, తోడేటి మణి, టి.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
విలేకర్లు కావలెను
తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9000483583

## సకాలంలో పన్నులు చెల్లించకుంటే..

# షాపులు సీజ్ : కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక స్టోన్ హౌస్ పేట కన్యకా పరమేశ్వరి దేవాలయం సమీపంలోని కేఏసీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందు దుకాణాలను కమిషనర్ గురువారం తనిఖీ చేశారు. దుకాణాల నిర్వాహ కులు అద్దె బకాయిలను నోటీసులలో పేర్కొన్న సమయంలోపు చెల్లించాలని, లేనిపక్షంలో దుకాణాలను జప్తు చేసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. కేటాయించిన మున్సిపల్ దుకాణాలను నిర్వాహకులు యధాస్థితిలో ఉంచి వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవాలని, దుకాణాలలో ఇతర అదనపు నిర్మాణాలు, మరమ్మతుల కోసం నిర్మాణాల తొలగింపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే సీజ్ చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ-2 ఆలా శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన గురువారం సాయంత్రం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్లో తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సరేన ధ్రువపత్రాలు లేని, హెల్మెట్ ధరించని, వాహనదారులను గుర్తించి ఫైన్ విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మైనర్లకు తల్లిదండ్రులకు వాహనాలు ఇవ్వకూడదు అన్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అధిక వేగం పోకుండా కుటుంబాన్ని గుర్తించుకొని పరిమిత వేగంతో వెళ్ళాలన్నారు. ఈయన వెంట సిబ్బంది ఉన్నారు.